క్లుప్తంగా

రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వం

నకరికల్లు: రాష్ట్రానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బీజేపీ తొమ్మిదేళ్ల విధ్వంసకర పాలనపై చర్చ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామని హామీని నెరవేర్చకుండా యువతను మోసం చేసిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొక్కా చిన్నగురు, కౌలు రైతు సంఘం, రైతు సంఘం నాయకులు జి.పిచ్చారావు, ఈవూరి అప్పిరెడ్డి, ప్రజాసంఘాల నాయకులు షేక్ మస్తాన్‌వలి, కోటా నాయక్, రవినాయక్, గోదాబాల, గుత్తికొండ చినసైదా, గాదె కుమారి, జాన్ అహ్మద్, విశ్వేశ్వరరావు, రామాంజినాయక్, చట్టు కోటేశ్వరరావు, బాజి, గోదా చిన్ని, మడకా వెంకటేశ్వర్లు, సుభాని పాల్గొన్నారు.

తహసీల్దార్ సురేష్‌కు సత్కారం

సత్తెనపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల సత్తెనపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.సురేష్‌ను సత్తెనపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన వడ్డెర సంఘ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బి.శ్రీనివాసరావు, వి.అరుణ్, వి.రామకోటేశ్వరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సత్తెనపల్లి: ముప్పాళ్ళ మండలం మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అన్నపరెడ్డి చరణ్‌కి ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 551 మార్కులు సాధించి ప్రతిభ చూపాడు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ రెండు నెలల గౌరవ వేతనాన్ని మంగళవారం పారితోషికంగా అందించాడు. వైఎస్ఆర్ సీపీ నాయకులు జి.కోటేశ్వరరావు, ఎ.లక్ష్మణ, ఎం.విజయ్ కుమార్, జె.సాయి మహేష్, డి.జగన్మోహనరావు, అల్లూరి వీరయ్య పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

రాజుపాలెం: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్‌తో పాటు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని సర్పంచి గౌతుకట్ల జ్యోతి, హెచ్‌ఎం ఎం. నాగమల్లేశ్వరి తెలిపారు. మండలంలోని బలిజేపల్లి మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలను, స్టేషనరీని మంగళవారం అందించారు. గ్రామానికి చెందిన శ్రీకాళహస్తి కామేశ్వరరావు సాయంతో అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఏ సుధీర్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గౌతుకట్ల గురవయ్య, ఉపాధ్యాయులు ఎస్‌కే మస్తాన్, ప్రసాదరావు, సాయిరాంరెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంఈఓలకు సత్కారం

రాజుపాలెం: మండల కేంద్రంలోని విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఎంఈఓలను ఎస్టీయూ ఏపీ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఎంఈఓ-2 కేవీఎల్ నరసింహారావును, ఎంఈవో-1 బి.మల్లికార్జునశర్మను సన్మానించారు. ఎస్టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే నుహనుల్లా, ఉపాధ్యాయులు బ్రహ్మేంద్ర నాయక్, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ సకాలంలో చేసుకోవాలి

నకరికల్లు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 1,400 మంది రైతులు పీఎం కిసాన్ పథకానికి ఈ-కేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మంగళవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. త్వరలో పీఎం కిసాన్ 14వ విడత నిధులు జమకానున్న దృష్ట్యా రైతులు గమనించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

క్రోసూరు: మండలంలోని అనంతవరం శివారులో పేకాటాడుతున్నట్లు సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ మహబూబ్‌సుభాని దాడులు నిర్వహించారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వీరి నుంచి రూ.13,150 స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మిద్దాం

క్రోసూరు: ఏపీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బూరో(ఎస్ఈబీ) ఆధ్వర్యంలో క్రోసూరు పోలీసులు నేతృత్వంలో క్రోసూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులతో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం అంటూ ర్యాలీ, మానవహారం మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ మహబూబ్‌సుభాని పాల్గొన్నారు.

విద్యార్థులు అంకితభావంతో చదవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: విద్యార్థులు అంకితభావంతో చదవాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సూచించారు. స్థానిక రామకృష్ణా హిందూ హైస్కూల్‌లో జగనన్న ఆణిముత్యాలుకు సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం జగనన్న ప్రవేశపెట్టిన అనేక పథకాలతో సర్కారు బడుల విద్యార్థులు ప్రపంచాన్ని ఏలే రోజు తప్పక వస్తుందని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రణాళికతో విద్యార్థులందరూ భవిష్యత్‌లో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు చదువులోనే కాక ఆటపాటలలోను రాణించాలని కోరారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా రెండు విడతలలో వేల కోట్ల రూపాయలతో సర్కారు బడులను కార్పొరేట్ బడుల కంటే నాణ్యతతో అందంగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు. నాలుగేళ్లలో కేవలం విద్యకోసం పెదకూరపాడు నియోజవర్గంలో సుమారు రూ.300 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన పాటిబండ్ల సాయి వినీల, కొండవీటి ప్రజ్వల, కొణతాల శ్రీవల్లి, గుండా రత్న మాణిక్యం, అలాగే ఇంటర్మీడియెట్‌లో నాలుగు గ్రూపులలో ప్రథమస్థానం సాధించిన ముప్పారపు మానస, బత్తుల దుర్గాప్రసాద్, కంభంపాటి నయోమి, ఉప్పు శ్రావణిలకు శాలువాలు కప్పి, మెడల్స్ తో పాటుగా నగదు బహూకరించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, క్రోసూరు ఎంపీపీ కోటయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, సర్పంచులు పి.రాజేశ్వరి, మాదాసు పావని, బంకా విష్ణు, ఎంఈఓలు శ్రీనివాసరావు, శివబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అళ్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు, అలా లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.



జగనన్న అణిముత్యాలును సన్మానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



దేచవరం అదర్శ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలుకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పేదలకు కార్పొరేట్ విద్య ఘనత జగనన్నదే

నకరికల్లు: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దేచవరం ఆదర్శ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. పదో తరగతిలో మూడు స్థానాలు సాధించిన మహేష్‌బాబు, గాయత్రి, చంద్రికలకు నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేళాంగిణి మేరీ, ఉపసర్పంచి భవనం రమణారెడ్డి, ఏరువ శివారెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దొండేటి కోటిరెడ్డి పాల్గొన్నారు. జగనన్న విద్యాకానుక మండలంలోని చీమలమర్రిలోని ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు పార్టీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.బాలస్వామి నాయక్, సర్పంచి బత్తుల ఉపేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు తిరుమలశెట్టి సాంబయ్య, ఎస్ఎంసీ చైర్మన్ జె.నాగుల్‌మీరా, కావేటి రామారావు, నలగట్ల శ్రీను, చిమటా నాగాంజనేయులు, దేవరశెట్టి శ్రీనివాసరావు, ముప్వా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సుపరి పాలనకే 'సురక్ష'

- 24 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటి సర్వే
- ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ

సత్తెనపల్లి: జగనన్న సురక్ష పథకం సుపరిపాలనకేనని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం సత్తెనపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సత్తెనపల్లి మండలంలోని 10 సచివాలయాలకు సంబంధించిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు జగనన్న సురక్షపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తొలుత గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. మండలంలో 19 గ్రామ సచివాలయాలు ఉన్నాయని, వీటిలో 148 మంది సచివాలయ ఉద్యోగులు, 404 మంది వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. వీరందరితో కలసి ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారని చెప్పారు. తహసీల్దార్ ఎస్.సురేష్ మాట్లాడుతూ రెండో దశ క్రింద ఆయా గ్రామాల్లోని సచివాలయాలను మండల స్థాయి అధికారులు సందర్శించనున్నట్లు తెలిపారు. అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు పిలిపించి వారికి కావలసిన సర్టిఫికెట్లను, డాక్యుమెంట్లను అదే రోజున అందజేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలు అందే లా చర్యలు తీసుకుంటారన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, డెప్యూటీ తహసీల్దార్ ఒక టీంగా, తహసీల్దార్, పంచాయతీరాజ్ ఏఈలు మరో టీంగా ఏర్పడతారన్నారు. ఈ రెండు బృందాలు సచివాలయాలకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తాయని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విస్తరణ అధికారి దయాసాగర్ మాట్లాడారు. తొమ్మిది సచివాలయాలకు బుధవారం రోజున శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్య నారాయణ, పక్కన తహసీల్దార్ సురేష్, ఈఓపీఆర్డీ దయాసాగర్

అమరావతిలో..

అమరావతి: జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఈఓపీఆర్డీ ప్రసాదరావు కోరారు. స్థానిక శ్రీరామకృష్ణా హిందూ హైస్కూల్‌లో జగనన్న సురక్ష పథకంపై అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి వివిధ ధ్రువ పత్రాలు లేకుండా పథకాలు పొందలేని వారిని వలంటీర్లు గుర్తించాలన్నారు. వారందరిని సచివాలయలకు తీసుకువచ్చి కావాల్సిన ధ్రువపత్రాలకు దరఖాస్తు పెట్టించాలన్నారు. వాటిని ఆన్‌లైన్ చేసిన తర్వాత మండల స్థాయి అధికారులు సచివాలయలకు ప్రత్యేక క్యాంపుకోసం సచివాయలం వచ్చి విచారణ జరిపి సర్టిఫికెట్లను మంజూరు చేయాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధురి, తహసీల్దార్ విజయశ్రీ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- కర్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

అమరావతి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. కర్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం మంగళవారం నిర్వహించారు. తొలుత ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిపై ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాలుగేళ్లలో రూ.10 కోట్లు సంక్షేమానికి ఖర్చు చేసినట్లు చెప్పారు. అందులో రూ.1.42 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.29 లక్షలు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యుడు బీ రాంబాబు, ఎండ్రాయి సర్పంచి నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వీరరాఘవయ్య, శ్రీనివాసరెడ్డి, సాంబయ్య, లక్ష్మీనారాయణ, కరుణకుమార్, వాసు, రాంబాబు, ఉగ్గం యలమందయ్య, శివ పాల్గొన్నారు.



కర్లపూడిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

యోగతో మానసిక ప్రశాంతత

అచ్చంపేట: యోగతో మానసిక ప్రశాంతత సాధ్యమని యోగ ఇన్‌స్ట్రక్టర్ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ యోగ దినోత్సవంలో భాగంగా ఆదాని ఫౌండరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యోగ సాధనకు రోజులో కొద్ది సమయమైనా కేటాయించాలని సూచించారు.

ముఖ్యంగా విద్యార్థులు చదువుపై ఏకాగ్రత కలిగి లక్ష్యాలను అధిరోహించే శక్తి చేకూరుతుందని చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జునరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆలపాటి సుజాత తదితరులు పాల్గొన్నారు.



యోగ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్పీహెచ్‌ఎస్ స్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎస్సీ, ఎస్టీ, కౌలు రైతులకు అండగా ప్రభుత్వం

నకరికల్లు: ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సీసీఆర్సీ కార్డులు మంజూరు చేస్తోందని డీబీఆర్‌సీ రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తెలిపారు. డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని చీమలమర్రి, కండ్లకుంట, చల్లగుండ్ల గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కౌలు రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డీబీఆర్‌సీ ఏరియా కో ఆర్డినేటర్ కోటిరత్నం పాల్గొన్నారు.

సాగుకు భరోసా ... రైతన్న దిలాసా

- ప్రతి ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం
- వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ రైతుభరోసా
- సత్తెనపల్లి డివిజన్‌లో 82,893 మంది రైతులకు లబ్ధి
- అన్నదాతల ఖతాల్లో నేరుగా రూ.45.68 కోట్ల జమ

సత్తెనపల్లి: సాగులో అడుగడుగునా అన్నదాత చే యిపట్టి నడిపిస్తూ అండగా నిలుస్తోంది ప్రభుత్వం. భూసార పరీక్షల నుంచి పంట ఉత్పత్తులను విక్రయించుకునేంత వరకు రైతన్నలకు వెన్నంటి నిలుస్తోంది. ముందస్తు సాయం అందించింది. పల్లె ముంగిట అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంచింది. సాగు చేయలేమనే స్థితి నుంచి వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత ప్రభుత్వానికి దక్కింది. పేరుగాంచింది. విత్తు నుంచి దిగుబడుల విక్రయం వరకు అన్నదాతకు అన్ని విదాలుగా అన్నదాతలకు అండగా నిలుస్తుంది. పాదయాత్ర సమయంలో రైతుల కష్ట, నష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రైతు సంక్షేమానికి పెద్దపేట వేశారు. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసేందుకు రసాయన ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడికి చేతిలో డబ్బులు లేక అన్నదాత పడుతున్న అవస్థలను గుర్తించి రైతు భరోసా పథకాన్ని అమల్లోకి తెచ్చారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల్లోని తొమ్మిది మండలాల్లో 82,893 మంది రైతులకు రూ.45.68 కోట్లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది ప్రభుత్వం.

పొలం ఉన్న ... ప్రతి రైతు అర్హుడే

రైతు భరోసా పథకానికి పొలం ఉన్న ప్రతి రైతును రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా నిర్ణయించింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్‌నిది యోజన కింద రూ.6 వేలు కలుపుకుని రూ.13,500 పెట్టుబడి సాయాన్ని మూడు విడతల్లో రైతు ఖాతాల్లో జమ అవుతుంది. ఖరీఫ్‌లో పంట వేసే ముందు మే నెలలో మొదటి విడతలో రూ.7,500, అక్టోబర్‌లో పంట కోతల సమయంలో రూ.4 వేలు, ధాన్యం ఇంటికి చేరే సమయంలో జనవరిలో రూ.2 వేలు చొప్పున పెట్టుబడి సాయం అందుతుంది. కౌలు రైతులకు మొత్తం పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ లోని ఆయా మండలాల పరిధిలో సాధారణ సాగు 2,51,509 ఎకరాలు. దీనిలో వరి 41,164 ఎకరాలు, పత్తి 1,08,656 ఎకరాలు, మిరప 52,786 ఎకరాలు, ఇతర పంటలు 48,903 ఎకరాల్లో పంటు సాగుఅవుతున్నాయి. వివిధ పంటల సాగుకు కావాల్సిన విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల కోసం ఒక్కో రైతుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 నగదు ఖాతాల్లో జమ చేయగా పీఎం కిసాన్ సమ్మన్ నిధికి సంబంధించి రూ.2 వేలు త్వరలో జమ చేసేందుకు కసరత్తు జరుగుతోంది.



భూమి సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ సమాచారం

- మొత్తం రైతు భరోసా కేంద్రాలు -134
- సాధారణ సాగు విస్తీరణం-2,51,509 ఎకరాలు
- గత ఏడాది సీసీఆర్సీ కార్డులు పంపిణీ- 16,100
- ఈ ఏడాది సీసీఆర్సీ కార్డుల లక్ష్యం-17,000

రైతు చనిపోతే ఆ కుటుంబంలో మరొకరికి ....

రైతు భరోసా పథకం ద్వారా లబ్ధిపొందే రైతు ఏ కారణంతోనైనా మరణిస్తే ఆ నగదు ఆ కుటుంబంలో మరోకరికి అందుతోంది. రైతు చనిపోతే వెబ్ ల్యాండ్ డేటాను ఆ ఇంట్లోని కుటుంబ సభ్యుల పేరున నమోదు చేసుకోవాలి. రైతు భరోసా కేంద్రంలో పథకం వర్తింపునకు దరఖాస్తుతో పాటు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, చనిపోయిన రైతు మరణ ధ్రువీకరణ పత్రం అందజేస్తే కొత్త రిజిస్ట్రేషన్ కింద నమోదు చేసి రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తున్నారు.

అలాగే ఈ ఏడాది కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులకు పెట్టుబడి సాయం అందింది. సొంత భూములు ఉన్న రైతులతోపాటు కౌలు రైతులకు పథకం ద్వారా నగదును జమచేస్తోంది. భూ యజ మానులతో పాటు కౌలు కార్డులు (సీసీఎస్) కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకు మాత్రమే ఈ పథకం వర్తింపజేశారు.

రైతు భరోసా పథకానికి అర్హులు .....

- కనీసం అరఎకరా సొంత పొలం కలిగిన రైతులు
- ఉద్యాన, పట్టుపరిశ్రమకు రైతు భరోసా పథకం వర్తింపు
- కూరగాయలు, పువ్వులు, పశువుల మేత కోసం అర ఎకరం భూమి సాగు చేస్తుండాలి
- ఒకే యజమానికి ఒకరికి మించి కౌలుదారులుంటే వారిలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ఒకరికి మించి కౌలుదారులుంటే ఎస్టీలకు పాధాన్యం, ఆ తర్వాత ఎస్సీ,బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యం.

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో రైతుల లబ్ధి ఇలా...

మండలం	అర్హులైన రైతులు	నగదు (రూ.కోట్లలో)
సత్తెనపల్లి	13,927	7.66
ముప్పాళ్ల	7,821	4.30
రాజుపాలెం	6,935	3.84
నకరికల్లు	10,440	5.77
పెదకూరపాడు	8,795	4.84
అమరావతి	10,101	5.56
అచ్చంపేట	9,908	5.46
క్రోసూరు	10,307	5.67
బెల్లంకొండ	4,659	2.59
మొత్తం	82,893	45.68

విప్లవ వీరుడు అల్లూరి స్ఫూర్తిదాయకం

సత్తెనపల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని రిటైర్డ్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ తోట కూర వెంకటనారాయణ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, రోటరీ క్లబ్ చిలకలూరిపేట వారి సంయుక్త ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి మంగళవారం నిర్వహించారు. అధ్యాపకుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు పాత్ర విద్యార్థులంతా తెలుసుకోవాలన్నారు. రోటరీ జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయిప్రసాద్, పాఠశాల ప్రధానో పాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రోటరీ సభ్యులు మాతంగి సాంబశివరావు, సరికొండ రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు నేలటూరి రమేష్ బాబు, గద్దం రాజేంద్ర, కమలాకర్, సాంబశివరావు, మాధురి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటనారాయణ

ఎంఈఓ-2గా సీతారామిరెడ్డి బాధ్యతలు స్వీకారం

ముప్పాళ్ల: మండల విద్యాశాఖాధికారి-2గా ఎం.సీతారామిరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లాలోని వెలికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. సీతారామిరెడ్డిని పలు ఉపాధ్యాయ సంఘాల సభ్యులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.



కౌలు కార్డుల లక్ష్యాలు పూర్తి చేయాలి

ముప్పాళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు కార్డు(పంటసాగుపత్రం) లక్ష్యాలు పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశం మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలానికి మొత్తం 1700 కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటికే కేవలం 139 మాత్రమే అందించారని చెప్పారు. గ్రామాల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాల్సిందేనన్నారు. అర్హులైన ప్రతి ఒక్క కౌలు రైతుకు తప్పనిసరిగా కార్డు అందించాలని కోరారు.